1462

# అరూప వీక్షణం

బ్యాంక్ ఉద్యోగం తనంతతాను కావాలని కోరుకోలేదు నీరజ. అంతా అలా అలా కలిసి వచ్చింది. బి.కాం. ప్యాసయి ఇంట్లో కూర్చున్నప్పుడు తెలిసిన వాళ్ళందరూ "నీలాంటి బ్రిలియంట్ స్టూడెంట్ ఖాళీగా వుండడం బాగుళ్ళేదు. ఎం.కాం. చదువు" అని సలహా ఇచ్చినవాళ్ళే. కాని ఎం.కాం. చదవటానికీ, అందులో సీట్ సంపాదించటానికీ ప్రయత్నం చేయగల పలుకుబడి, అవకాశం నీరజకు లేవు.

తాను రికామీగా వుండడం ఇష్టం లేనట్టుగా ఒకరోజు న్యూస్‌పేపర్లో నేషనలైజ్‌డ్ బ్యాంక్స్ ప్రొబేషనరీ ఆఫీసర్ల ప్రకటన వచ్చింది. వివరాలన్నీ నిదానంగా చూచింది. ఎవరినీ అడగవలసిన పనిలేదు. అప్లికేషన్ ఫాం తెప్పించుకోవడం, పూర్తిచేసి నియమితకాలంలో ఆ సెలక్షన్‌బోర్డ్ ఆఫీసుకు దాఖలుచేయడం, ఆ తరువాత దానికి సంబంధించిన పుస్తకాలు తిరగవేయడం లోకజ్ఞానం- భాషా పరిజ్ఞానంలో అవసరమైన మెలుకువలు తెలుసుకోవడం- ఇంతే చేయవలసిన పని.

ఫలానా రోజున వ్రాతపరీక్షకు రమ్మని ఎడ్మిషన్‌కార్డ్ వచ్చినప్పుడు, మరచిపోకుండా ఆ హాలుకు వెళ్ళడం, మూడుగంటలపాటు పరీక్షాపత్రంలో అడిగిన ప్రశ్నలన్నింటికీ తనకు తెలిసినంతవరకు జవాబులు వ్రాయడం తరువాతి మెట్టు. తీరా ఆరోజు పరీక్ష అయిన తర్వాత చూచుకుంటే, తనకు తెలియని జవాబులంటూ ఏమీలేవని తేలిపోయింది. శుభం! వాళ్ళు దయతలచి మంచిమార్కులు ఇస్తే ఇంటర్వ్యూకు పిలుస్తారు.

నీరజ ఈ ఘట్టాన్ని కూడా సునాయాసంగానే దాటింది. "మా బ్యాంక్ బ్రాంచీలు దేశమంతటా వున్నాయి. ఎక్కడికి పోస్టుచేసినా వెళ్ళగలరా?" అన్న ప్రశ్న తప్ప ఇంకేం అడగలేదు— ఆ ఇంటర్‌వ్యూ బోర్డు సభ్యులు. "అందుకేమీ అభ్యంతరం లేదు. అయినా ఈ విషయం అప్లికేషన్లు కాల్‌ఫర్ చేసిన ప్రకటనలోనే వుంది" అంది నీరజ అతి వినయంగా. 'దట్స్‌గుడ్'- అన్నారువాళ్ళు- అంతే. నెలరోజుల్లో ఉద్యోగం రానేవచ్చింది. ఉద్యోగంలో చేరిన తర్వాత వెనకటి మోస్తరుగా మందకొడిగా నిలవనీరుగా లేదు జీవితం. ఉరుకులు, పరుగులు. రకరకాల సవాళ్ళు. ప్రతి సవాలును నీరజ స్వాతిశయంతో ధీమాగానే ఎదుర్కొంది. విసుగు విరామం లేకుండా ఒక్కబిగిని పని చేయడం చాలదు- ఉద్యోగం అంటే ఎంతో ఓర్పుగా ఖాతాదార్లు అడిగే తికమక ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. స్టాఫ్‌ను ఎవరినీ నొప్పించక

కుండా వాళ్ళచేత చురుకుగా పని చేయించుకోగలగాలి. వాళ్ళు వదిలేసిన పనిని, తీరుబాటుగా సాయంత్రం గంటలు కూర్చుని స్వంతంగా పూర్తిచేసుకోవాలి. లెడ్జర్లు బ్యాలెన్స్ కాకపోతే అవి ఎందుకు మొరాయిస్తున్నాయో నిలదీసి మరీ కనుక్కోవాలి. వ్యక్తిగత సమస్యలు, సందర్భాలు ఆఫీసు పనిలో ప్రభావం చూపకుండా అనుక్షణం జాగ్రత్త తీసుకోవాలి. ఇలా ఎన్నో ఇరుకులు, అనువుగాని సందర్భాలు!

వీటన్నిటినీ అర్థం చేసుకుని ప్రమాదాలలో పడకుండా ముందంజ వేయడానికి రఘునాథ్ ఎంతో సహాయపడ్డాడు. నిజానికి అతని సానుభూతి, సహకారం లేకపోయినట్లయితే ఈ ఉద్యోగంలో ఇంత కులాసాగా నెట్టుకు రావడం అసాధ్యం అయిపోయేది. రఘునాథ్ అతి చురుకైనవాడు, చలాకీ అయినవాడూను. నీరజ బ్యాంక్‌లో చేరినప్పుడు అతను మేనేజర్. రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫర్ అయి ఈ బ్రాంచినుంచి వెళ్ళిపోయేంత వరకు, నీరజకు కావలసిన ధైర్యం, స్థైర్యం అందచేసినవాడు అతనే. నిలువుటద్దంలో తన బొమ్మను తాను చూచుకుంటున్నట్లుగా వుండేది నీరజకు, అతనితో మాట్లాడుతున్నప్పుడు. స్ఫటికం లాంటి మనిషి.

తనకు తెలియకుండానే నీరజ అతనిపట్ల ఆకర్షితురాలయిపోయింది. 'ఇంత చక్కటి సుహృద్భావం వున్న మనిషి- జీవితంలో గూడా చేదోడు వాదోడుగా వుంటే ఎంత బాగుండును' అని ఆమె ఆలోచనలు చేయగల సందర్భాలు క్రమక్రమంగా ఎక్కువ కాసాగాయి. కాని పైకిమాత్రం ఏమీ తేలకుండా, అనవసరంగా బయట పడిపోకుండా జాగ్రత్తగా వుంటూవచ్చింది నీరజ.

అతని అభిప్రాయాలతో చాలామటుకు ఏకీభవించడం తప్ప, ఈ ఏకీభావాన్ని వ్యక్తపరచకుండా సంభాషణలు పొడిగించకుండా మర్యాదగా హుందాగా దూరంగా వుండిపోతూ వచ్చింది.

"మాది చాల సంప్రదాయమైన కుటుంబం" అన్నాడు ఒకమారు రఘునాథ్.

'ఈ దేశంలో ఎవరిది సాంప్రదాయ కుటుంబం కాదు? అందరూ భారత సాంప్రదాయాన్ని కాస్తో కూస్తో పుణికిపుచ్చుకున్నవాళ్ళేగదా-' అనుకుంది మనసులో నీరజ.

"మాది చాల బీద కుటుంబం; ఏ మాత్రం సంపన్నులం కాదు-" అన్నాడు మరోమారు.

ఈ దేశమే బీదది. ఈ దేశంలోని జనాభాలో ఎవరూ ఈ రోజున సిరిసంపదలతో తులతూగుతున్నాం అని చెప్పుకోవటానికి వీల్లేదు. 'శ్రీలు పొంగిన జీవగడ్డ, పాలువారిన భాగ్యసీమ' అన్న పాటలు భారతదేశ పూర్వపు ఔన్నత్యాన్ని గేయరూపంగా చాటిచెప్పుకోవడానికి మటుకే తగినవి—' అనుకుంది నీరజ.

"నేను ఎంతో కష్టపడి చదువుకున్నాను. కష్టపడడం అనేది జీవితంలో విడదీయరాని ఒక భాగం అయిపోయిందినాకు-" అన్నాడు మరోసందర్భంలో.

'అందులో అతిశయోక్తి లేదు, అందరిపట్ల ఈ మాట యథార్థమే—' అనుకుంది నీరజ.

"జీవితాన్ని గురించి నాకెన్నో ఆశలు వున్నాయి. అ ఆశలను దూరం చేస్తూ ఎన్నో బాధ్యతలు బరువులు వున్నాయి-" అన్నాడు రఘునాథ్.

'మీకు, నాకు అని ఏమిటి ? ప్రతి జీవికీ ఏవో ఆశలు, బరువులు వుంటూనే వుంటాయి. వీటిని బేరీజు వేసుకుంటూ సమరసంగా బతుకు దొర్లించడమే జీవితం నేర్పేపాఠం-' అనుకుంది నీరజ మనసులోనే.

ఇలా వాళ్ళిద్దరి మధ్య ఇలాంటి మౌన సంభాషణలు- ప్రాపంచిక విషయాలను గురించి- వ్యక్తిగత ప్రసక్తులలోను నడుస్తూ వుండేవి. నోరు తెరిచి మాట్లాడకపోయినా ఒకరి అంతరంగం మరొకరికి కరతలామలకం అయినట్లు అనిపించేది.

ఇదంతా ఊహే కావచ్చును; కాని యథార్థానికి బహు దగ్గరగా వున్న ఆలోచనలా స్ఫురించేది నీరజకు.

ఒకమారు అవుననుకున్న దానిని ఆ తరువాత కాదనుకోవడంగానీ, నేను పొరపాటు పడ్డాననుకోవడంగానీ జరగలేదు. అసాధారణ సందర్భాలు ఎప్పుడో నూటికి కోటికి ఒకటిగా గాని తటస్థపడవుగద!

నీరజ ఊహలు చేసుకుంది.

ఊహలు మధురోహలు అయినాయి.

ఏకాంతంగా వీటిని దగ్గరచేర్చుకుని మనస్సును ఆనందంలో తేలిఆడేట్లు చేసుకోవడం అలవాటు చేసుకుంది. బాధ్యత ఎరిగిన మనిషిగా నీరజ రోజులు గడిపివేస్తోంది.

ఉన్నట్లుండి, రఘునాథ్ ఒకనాడు "మీతో కాస్సేపు మాట్లాడాలి. ఏమీ అనుకోకుండా పదినిమిషాలు కూర్చోగలరా?" అన్నాడు.

నీరజ నవ్వుతూ కూర్చుండిపోయింది.

మనస్సు పురులు విప్పుకుని నాట్యం ఆడటానికి తయారవుతూ వుంది. 'ఈరోజు నా జీవితంలో పర్వదినం. నా జీవితానికి కొత్త వెలుగులు ప్రసారం అయ్యే సందర్భం సమీపిస్తోంది-' అనుకుంటూ అంతరంగం అతిశయ పడుతోంది.

"మీరు నన్నేం అపార్థం చేసుకోగూడదు" అంటూ ప్రారంభం చేశాడు రఘునాథ్.

'అర్థం చేసుకోగలిగితే చాలు- అపార్థాలు ఎందుకు'- అనుకుంది.

"నేను చాలా ప్రయత్నం చేశాను. కాని నా శక్తి చాలలేదు. నేను నిస్సహాయుడినై పోతున్నాను" అన్నాడు.

"ఏమిటి మీరు చెప్పబోతున్నది?- అన్నట్లుగా చూచింది నీరజ అతని వైపు. ఆ చూపులు తట్టుకోలేనట్లుగా ముఖం కిందకు దించుకుని "మీరు క్షమించాలి" అన్నాడు.

"ఏమిటి మీరుచెబుతున్నది ? నాకేం అర్థం కావడంలేదు" అంది నీరజ. అతని నుంచి అసలు విషయం రాబట్టటానికి తాను ఈ మాత్రమైనా చొరవ తీసుకోవాలని ఆమెకు ఇప్పుడిప్పుడే స్పష్టం అవుతోంది.

"నన్నేం చేయమంటారు చెప్పండి. మా అమ్మచాటు పిల్లవాడిని నేను ఇంకా. ఎలాగైనా అమ్మగారిని వప్పించాలని రెండు నెలలుగా శతథా ప్రయత్నం చేశాను. నావల్ల కాలేదు. అమ్మ వప్పుకోలేదు. తను చెప్పినమాట వినకపోతే, ఏ నుయ్యో గొయ్యో చూచుకుంటానని కూర్చుంది. మరో మార్గం కనబడడంలేదు" అన్నాడు రఘునాథ్.

"క్షమించండి. నాకింకా ఏమీ అర్థం కావడంలేదు. ఏ విషయం మీరు చెబుతున్నది?" అని అడగడం తప్పనిసరి అయింది నీరజకు.

"నీరజగారూ! సూటిగా చెప్పడం ఎలానో తెలియక కొట్టుమిట్టులాడు తున్నాను. అసలు చెప్పకుండా వుండడం చేతగావడంలేదు. నన్నేం చేయ మంటారు?" అన్నాడు రఘునాథ్. అతని కంఠం రుద్ధం అవడం, మాటలు పెల్లుబికి పైకి రాలేకపోవడం నీరజకు ఆశ్చర్యాన్ని కలిగించడంతో పాటు కొంత దిగ్భ్రమ కూడా అనిపించింది.

'ఏమిటి ఈ మనిషి? ఏమి చెప్పాలనుకుంటున్నాడు ? అతని సూటి తనం, క్లుప్తత .. అన్నీ ఏమయిపోయాయి ? ఎందుకిలా డొంకతిరుగుడుగా తప్ప మాట్లాడలేకపోతున్నాడు- మనిషి....' నీరజకు అన్నీ ప్రశ్నలే. జవాబు చెప్పగల రఘునాథ్ చెప్పలేకపోవడం తప్ప ఇంకేమీ చేయలేకపోతున్నాడు.

"నాకు తెలుసు. నేనెప్పుడూ మీతో స్పష్టంగా చెప్పలేదు. కాని ఇప్పుడు సందర్భం వస్తుందనీ, అప్రియమైన విషయం అచ్చమయిన మాటలతో కలిపి చెప్పవలసి వుంటుందనీ నేను ఎరగలేకపోయాను. నా దౌర్భాగ్యాన్ని మీరు క్షమించాలి. మీరు క్షమిస్తే తప్ప నాకు మనశ్శాంతి లేదు" అన్నాడు.

"ఇంతకూ ఏమిటండీ మీకు వచ్చిన ఆ ఆపద?" అనడిగింది నీరజ.

"ఆపదంటే ఆపదకాదు.... జీవితమే సమాప్తం చేసుకుందామనిపిస్తున్న సందర్భం .." రఘునాథ్‌కు మాటలు బయటకు రాక గొంతు తడి ఆరిపోయి ఉక్కిరిబిక్కిరి అయిపోతూ వుంది.

"పోనీలెండి. తరువాత చెబుదురుగాని– ఇప్పటికి కాస్త సంబాళించు కోండి- అయాంసారీ...." అంటూ లేవబోయింది నీరజ.

"కూర్చోండి. ఇప్పుడు చెప్పలేకపోతే జీవితంలో ఇక మరెప్పుడూ నావల్ల కాదు" అన్నాడు రఘునాథ్.

ఆఫీస్ బాయ్‌ని పంపి రెండు చల్లని పానీయాలు తెప్పించింది నీరజ.

కాస్త ఈచల్లని నీటితో గొంతు తడుపుకోండి. తర్వాత చెబుదురుగాని" అంది ఒక గ్లాసు అతనికి అందిస్తూ.

గ్లాసు అందుకున్నప్పుడు రఘునాథ్ చేతులు వణకడం నీరజగమనిస్తూనే వుంది. 'ఎందుకు ఇతను ఇంత తబ్బిబ్బయిపోతున్నాడు?'

ఒక్క గుక్కతో గ్లాసంతా ఖాళీచేసి రఘునాథ్ నేప్‌కిన్‌తో పెదాలు తుడుచుకున్నాడు. "థాంక్స్ మీరు ధైర్యంగా వుండడం నాకు కొంత ఊరట" అన్నాడు.

"చెప్పండి" అంది నీరజ అతన్ని హెచ్చరిస్తూ.

"మీతో నేను చెప్పలేదన్నమాటేగాని మీరు అంగీకరిస్తే మిమ్మల్నే వివాహం చేసుకుందామని అనుకున్నాను. మీరు అంగీకరిస్తారని నా మనస్సుకు తెలుసు. అందుకనే నోరుతెరిచి చెప్పలేదు. కాకపోతే నా భయం అల్లా...."

అతని మాటలకు మధ్యలోనే అడ్డం తగులుతూ– "అంటే మీరు ఏకపక్ష నిర్ణయం తీసుకుని కూర్చున్నారన్నమాట. అంతా మీ ఇష్టమేనా?" అంది కవ్వింపుగా.

రఘునాథ్ కూడా తనలానే మధురోహల్లో సతమతమైపోతున్నాడన్న మాట!

"....కాని ఇప్పుడంతా నాకు వశం తప్పిపోయింది. నా శక్తికి మించి పోయింది ఈ ప్రయత్నం. మా అమ్మగారుససేమిరా అంగీకరించడంలేదు మన వివాహానికి. ఆమె బలవంతంమీద నేను మా మేనమామగారి కూతుర్ని వివాహం చేసుకోవడమే తప్పనిసరి అయిపోయింది" అన్నాడు రఘునాథ్.

"ఇంకేం, లక్షణంగా చేసుకోండి దానికింత సంకటపడతారెందుకు?" అంది నీరజ- తన దుఃఖం పైకి యేమాత్రం కనిపించనీయకుండా.

"నా ఆశలన్నీ అడియాసలయినాయి. నేను మా తల్లిగారిని ఏమాత్రం ఎదిరించలేను. మిమ్మల్ని మరచిపోవడం నావల్ల కాదు. నా మనస్సుకు ఇదో మాయని గాయం–" అన్నాడు రఘునాథ్.

నీరజకు విషయం పూర్తిగా తెలిసిపోయేసరికి, ఇంకాస్సేపు తాను అక్కడే కూర్చుంటే ఇంతకుముందు రఘునాథ్ వుండిన స్థితికి తాను కూడా తెలియకుండానే పడిపోవలసి వస్తుందని అర్థం అయింది.

"చూడండి, మిస్టర్ రఘునాథ్, మనమేం పెళ్ళి చేసుకుందాం అని నిర్ణయం చేసుకోలేదు; అసలు ఆ ప్రస్తావనే మనమధ్య ఇన్నాళ్ళూ రాలేదు. మీరు మనసులో ఊహలు చేసుకున్నారు. అవన్నీ చెల్లాచెదురయి ఆ బాధకు తట్టుకోలేకపోతున్నారు. ఇందులో నా ప్రసక్తి ఏమీ లేదనే నా ఉద్దేశ్యం. నేను క్షమించాల్సిన విషయం ఇందులో ఏమీ లేదు. అసలు ఈ విషయం మీరు నాతో డిస్కస్ చేయవలసిన అవసరమేలేదు. ఎనీవే, మీకు కలిగిన మనస్తాపానికి నా సంతాపం, కొంతలో కొంత ఇదంతా నా మూలంగానే అనుకుంటున్నారు గనుక మీరే నన్ను క్షమించాలి. మీ మనస్సును సంబాళించుకోండి. అమ్మగారు చెప్పినట్లే చేయండి. విష్‌యు గుడ్‌లక్-" అనేసి నీరజ తిరిగి అతని అనుమతి అడగకుండానే అక్కడనుంచి బయటకు వెళ్ళి పోయింది.

ఆ మరుక్షణం నుంచి నీరజకు ఈ ప్రపంచం ముందువరకూ వుండిన తీరులో కనిపించడం మానేసింది.

రఘునాథ్ ఇంకా ఎంత అవస్థపడ్డాడో ఆమెకైతే తెలియదుగాని, అతను మాత్రం ఈ బ్రాంచ్‌నుంచి బదిలీ చేయించుకు వెళ్ళిపోయాడు.

నీరజ మళ్ళీ నిలదొక్కుకోవటానికి పది పదిహేనురోజులు పట్టింది. తానుకూడా కొన్నాళ్ళు సెలవుపెట్టి ఇక్కడి నుంచి వెళ్ళిపోదామా అనుకుంది ముందు. కాని జీవితం విసిరే సవాళ్ళను ఎదుర్కోవడంలో తాను ఇంతవరకు పొందిన శిక్షణ ఆమెచేత ఆ పనిని చేయించకుండా నివారించింది.

నేనెందుకు పిరికిగా ప్రవర్తించాలి?

నాకేం అయింది?

నేను భయపడవలసిన పని, బెంగపడవలసిన పని ఏమీ చేయలేదే- అని తనను తాను విమర్శ చేసుకు చూచుకుని నిర్ధారణలు చేసుకుంది.

రఘునాథ్‌ను వివాహం చేసుకుంటే బాగుంటుందనుకున్నమాట నిజమే. మామూలు మనుషుల భాషలో తాను రఘునాథ్‌ని ప్రేమించి వుండవచ్చు. కాని ఆ ప్రేమ మరేమీ పిచ్చివేషాలు వేయించలేదు తనచేత. ఇక ముందు కూడా దానికోసం మనసు పోగొట్టుకోవడం ఎందుకు?- నీరజ ధైర్యం కూడ గట్టుకుంది.

కొత్త మేనేజర్ భాస్కర్ వచ్చి చార్జీ తీసుకున్నప్పుడు, నీరజ- ఇతనికి నేను అఫిషియల్ కోపరేషన్ ఇవ్వవలసిందే, ఇతని నుంచి స్ఫూర్తి తీసుకుని జీవిత గమనాన్ని అర్థం చేసుకోవలసిందే అనుకుంది.

మూడు నెలలు తిరగకుండానే భాస్కర్ ఆమెతో పెళ్ళి ప్రస్తావన తెచ్చినప్పుడు, "మీరు తొందరపడుతున్నారేమో? బాగా ఆలోచించుకోండి" అంది. బ్యాంక్ మేనేజర్లకు చేరువలో వున్న ఆడ ఆఫీసర్లను చూచినప్పుడు వివాహం చేసుకుందామని తప్ప వేరే ఆలోచన రాదా ఏమిటి- అని విడ్డూర పడింది.

"ఆలోచించడం అంతా అయిన మీదటే మీతో ప్రస్తావన చేస్తున్నాను. ఆలోచించుకోవడం ఇక మీ వంతు" అన్నాడు భాస్కర్.

"ఆలోచనలు అలా వుంచండి. అన్ని క్లియరెన్సులూ తీసుకున్నారా? అప్పుడు మరీ రండి"- అంది నీరజ.

ఆమె మాటల్లో కాస్త వెటకారం, వ్యంగ్యం వున్నదని గ్రహించడం భాస్కర్‌కు తేలికే అయింది.

"నీరజగారూ! మీమనసుకు అయిన గాయం నాకు తెలుసు. రఘునాథ్ నాకు అంతా చెప్పాడు పాపం, అతను పరిస్థితులలో చిక్కుకుపోయిన బానిస. ఇప్పటికీ చాలా బాధపడుతున్నాడు; మీకు తెలుసునో తెలియదో" అన్నాడు అపాలెజెటిక్‌గా.

"అతను బాధపడడం చాలా అనవసరం నన్నడిగితే నాకు దానివల్ల ఒరిగేదేం లేదు" అంది నీరజ ఆ ప్రస్తావన్ను అక్కడితో తుంచివేయాలనే ఉద్దేశంతో.

"నీరజగారూ! నాకూ ఆ విషయం తీసుకురావడం అంత మనస్సుకు నచ్చిన సంగతి కాదు, క్షమించండి".

భాస్కర్ అప్పటికి ఊరుకున్నా నీరజను వివాహం చేసుకోవాలన్న సంకల్పాన్ని మటుకు మానుకోలేదు.

అతను మరోసారి మాట్లాడినప్పుడు, నీరజ "అన్ని క్లియరెన్స్‌లూ అయిపోయినట్లేనా?" అంది.

"నా చెక్ క్లియరింగ్‌హౌస్‌లో ఎప్పుడో పాసయింది. ఇంకఎకౌంటెంట్ గారు లెడ్జర్‌లో జమ వేయించడమే తరువాయి. అదేపనిగా తొందరపెట్టడం ఎందుకని ఊరుకుంటున్నాను, అంతే" అన్నాడు భాస్కర్.

నీరజ చిరుమందహాసం చేసింది తనకు తెలియకుండానే.

"కాని ఒక్క విషయం గమనించండి భాస్కర్‌గారూ" అంది, ఏదో చెప్పబోతున్నట్లు గంభీరంగా గొంతు మార్చి.

"మీరేమీ నామీద జాలిపడి వివాహం చేసుకోవడం లేదుగదా! అలాంటి సెంటిమెంట్స్ నాకు సుతరామూ ఇష్టం వుండవు. ప్రేమించానను కోవడం, ఆ ప్రేమకోసం ఏడవడం, ఇతరుల్లో జాలి పుట్టించాలని ప్రయత్నం చేయడం ... ఇదంతా నాన్సెన్స్."

"బాగా చెప్పారు. నాకూ ప్రేమను గురించి అంత గొప్ప అభిప్రాయం లేదు. పెళ్ళికి వున్న స్థానం అంతకంటె సుస్థిరమైనదని నమ్ముతాను నేను. పెళ్ళి చేసుకున్న తర్వాత ప్రేమించుకోవడం ఉభయతారకమైన పని. పెళ్ళికి ముందు ప్రేమించుకోకపోయినా– ఆ దంపతులు సుఖంగా సంసారం చేసుకో గలరు. ఆ విషయంలో నాకేం సందేహం లేదు" అన్నాడు భాస్కర్.

నీరజకు ఇక అతన్ని నిరాకరించగల కారణం కనబడలేదు. ✲